

డెంగ్యూ కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు

జీవీఎంసీ జోన్-3లో సిద్ధమైన మలేరియా విభాగం

- 39 మంది ఏఎల్‌వో సీజనల్ సిబ్బంది నియామకం
- ఐదు సమస్యాత్మక వార్డుల గుర్తింపు
- విస్తృతంగా ఫాగింగ్, ఇంటింటి సర్వే
- 'సాక్షి'తో జోన్-3 ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రసాదరావు

సాక్షి ఇంటర్వ్యూ





న్యూ రేసపువానిపాలెంలోని కాలువలో అబేట్ పిచికారీ చేస్తున్న మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

మద్దిలపాలెం: వర్షా కాలంలో డెంగ్యూ కట్టడికి జీవీఎంసీ మలేరియా విభాగం సిద్ధమైంది. ఇప్పటి వరకు ఇంటింటినీ సందర్శించే సీజనల్ వర్కర్ల నియామకం జాప్యం కావడంతో దోమల నివారణ చర్యలు మందకొడిగా సాగాయి. యాంటీ లార్వా ఆపరేషన్(ఏఎల్‌వో) సీజనల్ సిబ్బంది నియామకంతో ఈ నెల 1 నుంచి ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. సమస్యాత్మక వార్డులను గుర్తించి దోమల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నారు. డెంగ్యూ కట్టడికి సంబంధించి తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యల గురించి జీవీఎంసీ జోన్-3 అదనపు వైద్యాధికారి(ఏఎంహెచ్‌వో) డాక్టర్ బి.ప్రసాదరావు గురువారం 'సాక్షి'కి తెలియజేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

జోన్-3లో సమస్యాత్మక వార్డులు 5

జీవీఎంసీ జోన్-3 పరిధిలో మొత్తం 14 వార్డులున్నాయి. వీటిలో డెంగ్యూ ప్రబలే సమస్యాత్మక ప్రాంతాలు గల ఐదు వార్డులను గుర్తించాం. 18వ వార్డు అప్పుఘర్, 19వ వార్డు జాలరిపేట, 22వ వార్డు శివాజీపాలెం, పీతలవానిపాలెం, మంగాపురం కాలనీ, 25వ వార్డు సీతంపేట, రాజేంద్రనగర్, మధురానగర్, 27వ వార్డు దొండపర్తి ప్రాంతాల్లో డెంగ్యూ కట్టడికి ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నాం.

ఐదుగురు చొప్పున సిబ్బంది కేటాయింపు

జోన్-3లో జనాభా అధికంగా ఉంటుంది. మలేరియా, డెంగ్యూ ప్రబలే సమస్యాత్మక ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా నివారణకు ఇంటింటి సర్వేను సీజనల్ సిబ్బంది ద్వారా చేపట్టాలి. జనాభా దామాషా ప్రకారం జోన్-3లో 80 మంది ఏఎల్‌వో సీజనల్ సిబ్బంది అవసరముంది. ప్రస్తుతం 39 మంది తాత్కాలిక సిబ్బందిని నియమించాం. వీరిలో సమస్యాత్మక వార్డుల్లోని ప్రాంతాలకు ఐదుగురు చొప్పున సిబ్బందిని కేటాయించాం. మిగిలిన వార్డుల్లో ముగ్గురు చొప్పున సిబ్బందిని సర్దుబాటు చేశాం.

ఉదయం 6 నుంచి ఇంటింటి సందర్శన

ప్రతి రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీజనల్ ఇబ్బంది ఇంటింటి సందర్శన చేస్తారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగిస్తారు. నీటి సంప్‌లో క్రిమిసంహారక మందులు వేస్తారు. దోమల ఉత్పత్తిని కట్టడి చేస్తారు. వారికి కాలనీ వాసులు సహకరించాల్సి ఉంటుంది. జోన్-3 మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీజనల్ సిబ్బంది దోమల నిర్మూలన చర్యలు చేపడుతున్నారు. విస్తృతంగా ఇంటింటి సర్వే, ఫాగింగ్ ప్రక్రియ, నిల్వ నీటిలో క్రిమిసంహారక మందుల పిచికారీ కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి.



జాలరిపేట తీరం వద్ద బోటులోని నిల్వ నీటిలో క్రిమిసంహారక మందు జల్లుతున్న సిబ్బంది



పిఠాపురం కాలనీలో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్, కైలాసగిరి ఫీడర్ల నిర్వహణ, వాటి పరిధిలో రోడ్డు పక్కన చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు, రవీంద్రనగర్, సుందర్ నగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మధురవాణికి డాక్టరేట్



ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న మధురవాణి

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని కర్రి మధురవాణికి డాక్టరేట్ లభించింది. విద్యా విభాగం ఆచార్యుడు టి.షారోన్ రాజు పర్యవేక్షణలో 'మత్స్యకార సమాజంలో పరివర్తన, విద్య, సుస్థిరమైన అభివృద్ధిలో జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాల' అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా గురువారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో మధురవాణికి డాక్టరేట్ ఉత్తర్వులు అందజేసి అభినందించారు. మత్స్యకార కుటుంబాల్లో విద్యా, సామాజిక అభివృద్ధికి గాయత్రి విద్యా పరిషత్, ఎంఎల్‌బీ ట్రస్ట్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న పాఠశాల చేస్తున్న కృషిపై ఈ పరిశోధనలో విస్తృతంగా అధ్యయనం చేశారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం



చేనేత వస్త్రాలు తిలకిస్తున్న సందర్శకులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి కల్యాణ మండపంలో గురువారం చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభించారు. భావన రుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ ఖాదీ, కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్, జైపూర్ బెడ్‌షీట్స్ వంటి వాటితో 40 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు చేనేత ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు సురేష్ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్: లారీని నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.6,000 జరిమాన విధిస్తూ నగరంలోని జ్యుడీషియల్ ప్రధాన మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలిలా.. సాగర్‌నగర్‌కు చెందిన పల్లా అప్పలరాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జార్ఖండ్‌కు చెందిన జనార్దన్ ఝా 2022 డిసెంబర్ 21న విశాఖ ఓడరేవు ప్రాంతంలోని లక్ష్మీ కాటా దగ్గరకు వచ్చి తన లారీలోని సరకును తూస్తున్నాడు. అప్పలరాజు మరో టిప్పర్‌లో వెనుక నుంచి వచ్చి బలంగా లారీని ఢీకొన్నాడు. పక్కనే ఉన్న డ్రైవర్ జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. హార్బర్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బి.సత్యనారాయణ శ్రీనివాస్ కేసు విచారణ జరిపి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304ఎ ప్రకారం కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

కేజీహెచ్‌లో ఆర్చ్, ఆర్‌వో ప్లాంట్ల ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కేజీహెచ్‌లో రూ.45 లక్షలతో నిర్మించిన ప్రధాన ద్వారాన్ని ప్రారంభించామన్నారు. దివీస్ ల్యాబ్ తమ సీఎస్సార్ నిధులు రూ.1.28 కోట్లతో సమకూర్చిన 12 యూనిట్లతో కూడిన 8 సురక్షిత తాగునీటి ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభించినట్లు చెప్పారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి



12వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీని 12వ వార్డులో బలోపేతం చేయడానికి సమష్టి కృషి అవసరమని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. సీతమ్మధారలోని పార్టీ నియోజకర్గ కార్యాలయంలో గురువారం 12వ వార్డు నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి దోహదపడాలన్నారు. అందరూ ఏకాభిప్రాయంతో వార్డు, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్టీ కోసం నిబద్ధతతో కష్టపడి పనిచేసే వారినే కమిటీల్లో ఎంపిక చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉండేలా తాను బాధ్యత తీసుకుంటానని మొల్లి అప్పారావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అక్కరమాని మంగరాజు, సత్తి మందారెడ్డి, చొక్కర శేఖర్, జ్యోతి ప్రకాష్, ఈగల బుజ్జి, సత్యనారాయణ, సూర్యారావు, సుజాత, కొండమ్మ, బంధం శ్రీను, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూతో పరిశోధన భాగస్వామ్యంపై ఎన్ఎస్‌టీఎల్ చర్చలు



ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలతో ఏయూ వీసీ రాజశేఖర్, ఆచార్యులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో పరిశోధన సంబంధంగా కలిసి పనిచేసే దిశగా ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు చర్చించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గురువారం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో ఏయూ అధికారులతో ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు వి.ఎఫ్.సాజి, వి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాలరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగంతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలోని పలు విభాగాలతో సంయుక్తంగా కలిసి పని చేయడంపై చర్చించారు. త్వరలో ఒక సాంకేతిక సమ్మేళనం(కాంక్లేవ్)నిర్వహించే దిశగా చర్చలు జరిపించారు. భవిష్యత్తులో వివిధ అంశాలతో పరిశోధన సంబంధంగా పనిచేసే దిశగా అవసరమైన అవగాహన ఒప్పందాలు చేసుకోవడంపై ప్రాథమిక చర్చలు జరిపారు. ఎంటెక్ నావెల్ ఆర్కిటెక్చర్ (ఈవెనింగ్ కోర్సు)లో ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, సిబ్బందిని భాగస్వామ్యం కల్పించే దిశగా చర్చించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, డీన్ ఔట్ రీచ్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా విమ్స్ ప్రవేశ ద్వారం



బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు విమ్స్ ద్వారం వద్ద బురద, గోతులు

ఆరిలోవ: హనుమంతవాక దరి విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ప్రవేశ ద్వారం చిత్తడిగా మారింది. దీనికి రెండు వైపుల ప్రవేశ ద్వారాలున్నాయి. వాటిలో బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ఉన్న ద్వారం వద్ద గోతులు పడ్డాయి. కొన్నేళ్లుగా ఈ గోతులతో రోగులు ఇబ్బంది పడుతున్నా.. ఇంత వరకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇక్కడ గోతుల్లో నీరు చేరి బురదగా మారింది. దాన్ని దాటుకుంటూ రోగులు విమ్స్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులతోపాటు వైద్యులు కూడా ఎక్కువగా ఈ ప్రవేశ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తారు. సుమారు ఏడాదిగా ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్‌కు కూడా ఇదే ప్రవేశ మార్గం కావడం విశేషం. ఈ మార్గం వద్ద గోతులను పూడ్చి మరమ్మతులు చేయాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయండి



రైల్వే స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి, ఆటో డ్రైవర్స్

తాటిచెట్లపాలెం: ఈనెల 9న దేశవ్యాప్తంగా జరగనున్న రవాణా రంగ సమ్మెను విశాఖలోని రవాణా రంగ కార్మికులు జయప్రదం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వామనమూర్తి మాట్లాడుతూ, ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌సీ, సెన్సార్ డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని రద్దు చేయాలని, అలాగే వాహనమిత్ర కింద ఆటో డ్రైవర్లకు వెంటనే రూ. 15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ చట్టం (సెక్షన్ 106(2))ను రద్దు చేయాలని, డీజిల్, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మోటార్ రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమ్మెకు రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొని మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షుడు వై. వెంకట్, జై గణేష్ కుమార్, రవి, కృష్ణ, సత్తిబాబు, చిన్న అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి

డాబాగార్డెన్స్: పోలియో రహిత సమాజానికి రోటరీ క్లబ్ నిరంతరం శ్రమిస్తుందని విశాఖపట్నం డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ పి.శోభన్ ప్రకాష్ పాల్గొని నూతన అధ్యక్షుడు పీవీ రఘుపతి, కార్యదర్శి ఎస్.వంశీమోహన్, మాజీ అధ్యక్షుడు డి.మధుసూదనరావు, జగన్‌మోహన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తుందన్నారు. పోలియో లేకుండా చేయాలన్నదే రోటరీ ముఖ్య ఉద్దేశమన్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ పి.శోభన్ ప్రకాష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తరించేలా కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు పీవీ రఘుపతి మాట్లాడుతూ రాబోయే కాలంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యదర్శి వంశీ మోహన్ మాట్లాడుతూ పలువురు మహిళలకు చేయూతనందించే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. వినయ్‌గాంధీ బిల్లాపాటి, మణిమాల బోగవిల్ల తదితరులు పాల్గొన్నారు.

హాస్య లఘు నాటికల పోటీలకు దరఖాస్తులు

సీతంపేట: రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో హాస్య లఘు నాటికల పోటీలను నిర్వహించనున్నట్లు అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనగోరేవారు 10 నిమిషాలకు మించని కామెడీ స్కిట్‌లను ప్రదర్శించాల్సి ఉంటుంది. పోటీదారులు తమ మేకప్ కిట్, దుస్తులు, వస్తు సామగ్రిని స్వయంగా తెచ్చుకోవాలన్నారు. మతం, కులం, ప్రాంతం, వ్యక్తులు లేదా రాజకీయాలను కించపరిచే విధంగా స్కిట్‌లు ఉండకూడదు. అశ్లీల పదజాలం లేదా ద్వంద్వార్థాలకు తావు లేదు. ఒక సంస్థ నుంచి గరిష్టంగా రెండు స్కిట్‌లకు మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రథమ బహుమతి రూ. 25,000, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, ద్వితీయ బహుమతి రూ.15,000, తృతీయ బహుమతి రూ.10,000, ప్రత్యేక కన్సోలేషన్ ప్రైజులు (ముగ్గురికి) ఒక్కో స్కిట్‌కు రూ.2,000 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 10వ తేదీలోగా తమ దరఖాస్తులను 'రైటర్స్ అకాడమీ, లీడర్ కార్యాలయం, వుడా లేఅవుట్, మద్రిపాలెం' చిరునామాకు పంపించాలని నిర్వాహకులు కోరారు. వివరాల కోసం ప్రోగ్రాం కన్వీనర్ మేడా మస్తాన్‌రెడ్డిని 9441344365, 9676040165 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: అమృత విశ్వవిద్యా పీఠం పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటింగ్, ఫిజికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మెడికల్ సైన్సెస్, సోషల్ బిహేవియరల్ సైన్సెస్, ఆర్ట్స్ హ్యూమానిటీస్, కామర్స్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. 60 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, నెట్, గేట్, సీఎస్ఐఆర్ అర్హత గల వారు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. మిగతా అభ్యర్థులకు రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. దరఖాస్తు చేయడానికి www.amrita.edu/phd వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

అలరించిన సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: నగరానికి చెందిన గాయనీ గాయకులు శోభన్‌బాబు నటించిన చిత్రాలలోని గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. వెంకీ రిథమ్స్ సంస్థ గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ సినీ సంగీత విభావరిని నిర్వహించింది. గాయనీ గాయకులు వెంకటేష్, బాబ్జి, ఎ.నరసింగరావు, రమేష్, కృష్ణంరాజు, రంజిత, సుజాత, జ్యోతి, మాధురి సినీ గీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు.

సత్తా చాటిన రైల్వే బాక్సింగ్ జట్టు



ఓవరాల్ చాంప్ సాధించిన జట్టు

విశాఖ స్పోర్ట్స్: ఎలైట్ వుమెన్ జాతీయ స్థాయి టోర్నీలో భారత రైల్వేస్ బాక్సింగ్ జట్టు 32 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. జ్యోతి ఫ్లైవెయిట్‌లో, ఎన్‌బి చాను ఫెదర్ వెయిట్‌లో, ప్రాచీ లైట్‌వెయిట్ కేటగిరీలో విజేతలుగా నిలిచి స్వర్ణాలందుకున్నారు. శశిచోప్రా లైట్‌వెల్టర్‌లో, లాషు మిడిల్‌వెయిట్‌లో, అల్ఫీ హెవీ వెయిట్‌లో రజత పతకాలను సొంతం చేసుకున్నారు. మంజు రాణి లైట్ ఫ్లైలో, శిక్ష బాంటమ్‌లో, నేహా సూపర్‌హెవీవెయిట్‌లో కాంస్య పతకాలందుకున్నారు. ఈ పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి.

పార్కు పరిశుభ్రం



ఆట పరికరాల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది



ఏసీబీ కార్యాలయం వద్ద గల జీవీఎంసీ పార్కును శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకొని పాత డెయిరీఫారం వద్ద గల జీవీఎంసీ పార్కులో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను గురువారం శానిటరీ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. ఇక్కడ ఏసీబీ కార్యాలయం ఎదురుగా గెడ్డ అంచున ఉన్న ఈ పొడవైన పార్కు పిచ్చి మొక్కలతో నిండి పాములకు ఆవాసంగా మారింది. దీనిలోని పాత్‌వేలు, ఆట పరికరాల చుట్టూ దట్టమైన పిచ్చిమొక్కలు మొలిచాయి. దీంతో పిల్లలు ఆడుకునేందుకు వీలుపడక పోవడంతోపాటు పెద్దలు వాకింగ్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పార్కు సమస్యపై 'సాక్షి'లో గురువారం 'ఉద్యానవనం.. అధ్వానం' అనే శీర్షికన వెలువడిన కథనానికి జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించారు. వారి ఆదేశాలతో 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పార్కును పరిశీలించారు. అందులో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. పాత్‌వేలు, ఖాళీ స్థలంతోపాటు పిల్లల ఆట పరికరాల చుట్టూ ఉన్న మొక్కలను తొలగించారు. పార్కును పరిశుభ్రం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ వెలుగులు

సాక్షి ఎఫెక్ట్..



బీఆర్‌టీఎస్ రోడ్డులో చినగదిలి వద్ద కొత్త బల్బులు అమర్చుతున్న సిబ్బంది

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారిలో కొన్నాళ్లుగా అంధకారం నెలకొంది. హనుమంతవాక నుంచి అడవివరం వరకు కిలోమీటర్ల మేర విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగడం లేదు. దీంతో రాత్రుళ్లు చీకట్లలో వాహన చోదకులు ఇబ్బంది పడుతూ ప్రమాదాలకు సైతం గురయ్యేవారు. వాహనాలు లైట్ల ఆధారంగా వాహన చోదకులు రాకపోకలకు సాగించాల్సి వచ్చేది. ఈ సమస్యపై ఈ నెల 1న 'సాక్షి'లో 'బీఆర్‌టీఎస్ రహదారిలో అంధకారం' శీర్షికన వెలువడిన కథనానికి జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. గురువారం పాక్లెయిన్ సహాయంతో సిబ్బంది హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, అడవివరం వరకు అన్ని లైన్లలో వెలగని విద్యుత్ దీపాలను తొలగించారు. పాడైన వాటికి మరమ్మతులు చేశారు. దీంతో బీఆర్‌టీఎస్ రోడ్డులో విద్యుత్ లైట్ల వెలుగులు విరజిమ్మాయి. సమస్య పరిష్కారం కావడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థుల అవగాహన



క్లాత్ బ్యాగ్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దని నినాదాలు చేస్తూ విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ బ్యాగ్స్ ఫ్రీ డే సందర్భంగా గురువారం ఎంవీపీ కాలనీలోని సమత కళాశాల వేదికగా గ్రీన్‌క్లైమేట్ టీమ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక్కసారి వాడి వదిలేసే 16 రకాల ప్లాస్టిక్ బ్యాగ్‌లను నిషేధించిందన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు హానికరమని, జీవకోటికి నష్టం చేకూరుస్తాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కోరమండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ అందజేసిన క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నిషేధం, జ్యూట్ బ్యాగ్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు క్లాత్ బ్యాగులు ప్రదర్శించారు.